
ప్రజాశక్తి

శుక్రవారం 28 జూన్ 2024

5

పార్వతీపురం మన్యం



ఐటిడిఎ ఎపిఒగా చిన్నబాబు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్‌గా జి.చిన్నబాబును నియమించినట్లు ఐటిడిఎ వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ఆయన విశాఖపట్నం టిసిఆర్‌ఎం ట్రైబల్ కల్చర్ రీసెర్చ్ బిఐఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఐటిడిఎ ఎపిఒ ఇన్‌ఛార్జి హయాంలో ఉంది.

సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పథంలో నడపాలి : మంత్రి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడపాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మంత్రి పదవి స్వీకరణ అనంతరం మొట్టమొదటి సారిగా అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లా అధికారులతో సమీక్షించారు. తొలుత కలెక్టర్ కార్యాలయానికి విచ్చేసిన మంత్రికి ఘనస్వాగతం లభించింది. సమీక్షలో మంత్రి మాట్లాడుతూ త్వరలో ఐటిడిఎ పాలక మండలి సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. జిల్లా భూ సమస్యలున్నాయని, వాటిని నివారించాలని సూచించారు. రైతులు అడిగిన విత్తనాలివ్వాలని, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించాలన్నారు. పంట నష్ట పరిహారం, పెండింగ్ వివరాలు సమర్పించాలని ఆదేశించారు. వ్యవసాయ యాంత్రీక పరికరాలు రాయితీతో ఇచ్చే అవకాశాలు గురించి ప్రశ్నించగా మార్గదర్శకాలు రావాల్సి ఉందని జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్‌పాల్ తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో ఖాళీగా ఉన్న వ్యవసాయ సహాయకుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. మొక్క జొన్న, పత్తి కొనుగోలులో ఎటువంటి ఇబ్బందులూ ఉండరాదన్నారు. ప్రభుత్వ లోగో ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలు మాత్రమే అందించాలని మంత్రి స్పష్టం చేశారు. అంబులెన్సులు మరమ్మతులకు గురైతే వాటికి వెంటనే బాగు చేయించాల్సిన అవసరం ఉందన్నారు. డోలి పరిస్థితి ఎక్కడా ఉండకుండా చర్యలు చేపట్టాలని, ఇందుకు అవసరమగు రహదారులపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. వసతి గృహాల్లో జ్వరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. వసతి గహాల్లో ఎఎన్ ఎం నియామకంపై చర్యలు చేపడుతున్నామన్నారు. గిరి గోరు ముద్ద తిరిగి ప్రారంభించేందుకు యోచిస్తున్నా మని అన్నారు. అంగన్వాడీ పోస్టుల భర్తీ సంవత్సరంలో ఒక నిర్దిష్ట కాలంలో జరపాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలకు నెలకు ఒక సమావేశం మినహా నిర్వహించరాదని మంత్రి ఆదేశించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందాలన్నారు. స్టడీ అవర్స్ నిర్వహించాలని ఆదేశించారు. బాలికల విద్యాలయాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి మారు మూల గ్రామానికి ముఖ్యంగా గిరి శిఖర గ్రామాల్లో తాగు నీరు అందాలని మంత్రి ఆదేశించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ జిల్లాలో జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు. ఆర్‌బికెల్లో రైతుల అవసరాలకు గుర్తించాలని సూచించారు. ఉపాధి హామీ కింద సాగు నీటి ప్రాజెక్టుల పూడికలు తొలగించాలని, అంబులెన్సులు వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ఐదు పిహెచ్‌సిలు జిల్లాకు అవసరం ఉందని, ప్రతిపాదనలు ఇప్పటికే సమర్పించామని చెప్పారు. అంగన్వాడీ సరుకులు పంపిణీలో లోపాలు జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. మే చివరి వారం నుండి పారిశుధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నామని, నీటి పథకాలు శుభ్రత, నీటి పరీక్షలు చేపట్టడం జరుగుతోందని తెలిపారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకష్ణ మాట్లాడుతూ పాలకొండ ఏరియా ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ లేదని, దానిపై దష్టి సారించాలని కోరారు. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ అంబులెన్సులు లేక గిరిజనులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. గుమ్మలక్ష్మీపురం సిహెచ్‌సి, పిహెచ్‌సిల్లో మందులు లేవని, అంబులెన్సు ఐదేళ్లుగామూలన పడి ఉందన్నారు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర మాట్లాడుతూ ఉద్యాన పంటల మార్కెటింగ్‌పై దృష్టి సారించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం పరిస్థితి వివరాలను అడిగారు. తాగు నీటి ద్వారా సంభవించే వ్యాధులు నివారించాలని ఆయన సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ టార్పాలిన్లు, ఆయిల్ ఇంజిన్లు అవసరం ఉందన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులపై తనిఖీలు చేస్తున్నామని ఆయన చెప్పారు. ఇరిగేషన్ ఎస్ఇ రాజరాజేశ్వరి మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, కాలువలు మరమ్మతులకు ప్రతిపాదనలు సమర్పిస్తున్నామన్నారు. జిల్లాలో 320 కిలోమీటర్ల మేర సాగు నీటి కాలువల్లో పూడికలు తొలగింపుకు ఇప్పటికే నిధులు మంజూరయ్యాయన్నారు. జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎంవిఆర్ కృష్ణాజి మాట్లాడుతూ ఆర్ సి పి ఎల్ డబ్ల్యు పథకం కింద 25 పనులు చేపట్టామని, అందులో 9 పనులు పూర్తయ్యాయని, ఉపాధి హామీ పథకం కింద 311 భవనాల పనులు చేపట్టగా 126 పూర్తయినట్టు వివరించారు. డ్వామా పీడీ కె. రామ చంద్ర రావు మాట్లాడుతూ జిల్లాలో 1.40 కోట్ల పని దినాలు కల్పించుట లక్ష్యంగా పనిచేస్తున్నమన్నారు. తద్వారా రూ.218 కోట్ల మెటీరియల్ కాంపోనెంట్ రానుందని చెప్పారు. రూ.350 కోట్ల వరకు వేతనాలు అందుతాయని చెప్పారు. గత ఏడాది 128 కిలోమీటర్ల మేర బిటి రహదారులు నిర్మించామని తెలిపారు. అలాగే సంబంధిత అధికారులు తమ శాఖలు చేపడుతున్న పనులు ప్రగతి వివరించారు. సమావేశంలో జెసి ఎస్ఎస్ శోభిక, ఇన్ ఛార్జ్ డిఆర్ఒ జి.కేశవనాయుడు, ఎస్‌డిసి ఆర్‌వి సూర్యనారాయణ, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

గిరిజన గ్రామాలకు ఫీడర్ అంబులెన్సులు

గిరిజన గ్రామాలకు ఫీడర్ అంబులెన్సులు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి గుమ్మిడి సంధ్యా రాణి అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లా అధికారులతో సమీక్షించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ జిల్లాను అభివృద్ధి పథంలో నడపాలని కోరారు. త్వరలో ఐటిడిఎ పాలక మండలి సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. విత్తనాలు, ఎరువులకు రైతులు ఎండలో నిలబడి పడిపోయే పరిస్థితి ఉండరాదని అన్నారు. చివరి భూముల వరకు నీరు అందాలని ఆదేశించినట్లు చేశారు. తోటపల్లి నీటిని జులై 1న విడుదలకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. పారాది కాజ్ వే కొట్టుకు పోవడంతో సాలూరు నుంచి మక్కువ మీదుగా లారీలు వెళ్లేందుకు అవకాశం కల్పించాలని సూచించామని చెప్పారు.

కురుపాం కవులకు అరుదైన గౌరవం

ప్రజాశక్తి - కురుపాం


మల్లిపురం జగదీష్


గంటేడ గౌరునాయుడు

విద్యార్థులు చదువుతున్న పాఠ్యపుస్తకాల్లో కురుపాం నియోజకవర్గానికి చెందిన కవుల రచనలకు చోటు కల్పించి అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. ఇందులో భాగంగా స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మల్లిపురం జగదీశ్ సాహిత్యం పాఠ్యాంశాలుగా తొమ్మిదవ తరగతి తెలుగు ఉప వాచకంలో "ఉరులు" అనే కథ. ఆంధ్ర విశ్వవిద్యాలయం, తెలుగు ఎంఎ విద్యార్థులకు శిలకోల (కథలు), దుర్ల (కవిత్వం) పుస్తకాలు సాహిత్య పాఠ్యాంశాలుగానూ, ఉస్మానియా విశ్వవిద్యాలయం దూరవిద్య తెలుగు ఎంఎ విద్యార్థులకు శిలకోల కథలు పాఠ్యాంశంగానూ చోటు చేసుకున్నాయి. అలాగే కురుపాంకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు గంటేడ గౌరునాయుడు మాష్టారి పాటలు పాఠాలుగా "పాడుదమా స్వేచ్ఛా గీతం " పాట మహారాష్ట్రలో తెలుగు పాఠ్యాంశంగా ఉంది. అలాగే "పాట" అనే కవిత ప్రస్తుతం తెలుగు నాట (ఆంధ్ర ప్రదేశ్) తొమ్మిదవ తరగతి తెలుగు వాచకంలో పాఠ్యాంశంగా ఉంది.'కట్టండి ప్రాజెక్ట్ లు" అనే కవిత డాక్టర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఎంఎ తెలుగు రెండో సంవత్సరం విద్యార్థులకు పాఠ్యాంశంగా ఉంది. ఈ సందర్భంగా వారికి గ్రామ పెద్దలు, అధికారులు పలువురు అభినందించారు.

ఎసిబికి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు ఓ పంచాయతీ కార్యదర్శి చిక్కారు. మండలంలోని రావివలస సచివాలయం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న అల్లు తిరుపతినాయుడు లంచం తీసుకుంటూ అవినీతి అధికారులకు పట్టుబడ్డారు. దీనికి సంబంధించి ఎసిబి డిఎస్‌పి బివిఎస్ఎస్ రమణమూర్తి తెలిపిన వివరాలిలావున్నాయి.

మండలంలోని రావివలస సచివాలయ పరిధిలోని లఖనాపురం గ్రామ సర్పంచ్ దూసి చిట్టెమ్మ తన పంచాయతీలో గతంలో నిర్మించిన కాలువలకు, సిసి రోడ్లకు సంబంధించిన బిల్లులు చేయాలని ఆమె కుమారుడు తిరుపతిరావు పంచాయతీ కార్యదర్శిని ఆశ్రయించారు. ఈ మేరకు బిల్లులు చేయాలంటే రూ.20వేలు ఇవ్వాలని కార్యదర్శి డిమాండ్ చేశారు. లంచం ఇవ్వలేని స్థితిలోవున్న దూసి తిరుపతిరావు ఎసిబి అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు గురువారం పంచాయతీ కార్యదర్శికి రూ.20వేలు లంచం ఇస్తుండగా మాటువేసి ఉన్న ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేశారు.


ఎసిబి అధికారులకు చిక్కిన పంచాయతీ కార్యదర్శి తిరుపతినాయుడు (వృత్తంలో)

తొలిరోజే పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎన్‌టిఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను ఒకటో తేదీన పంపిణీ చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. ఎన్‌టిఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీపై ఎంపిడిఒలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో పింఛన్లు పంపిణీ జరగాలన్నారు. ప్రతి ఉద్యోగికి 50 పింఛన్లు దాటకుండా సర్దుబాటు చేయాలని ఆయన ఆదేశించారు. ఇందుకు క్లస్టర్ విధానాన్ని అనుసరించి ప్రతి క్లస్టర్‌కు సిబ్బందిని పక్కాగా మ్యాపింగ్ చేయాలన్నారు. పింఛన్ల పంపిణీ సమయంలో సిబ్బందికి మినహాయింపు ఇవ్వరాదని ఆయన స్పష్టం చేశారు. ఎఎన్‌ఎం, పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీసు తదితర సిబ్బందిని అంతా వినియోగిం చాలని ఆదేశించారు. ఒకటో తేదీన శత శాతం పంపిణీ జరిగేలా ఎక్కడా సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యంనాయుడు మాట్లాడుతూ జిల్లాలో 1,44,518 మందికి రూ.96.70 కోట్లను పింఛన్లుగా పంపిణీ చేస్తున్నామన్నారు.

పలుచోట్ల వర్షాలు

పార్వతీపురం మన్యం జిల్లాలో గురువారం మధ్యాహ్నం పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. పార్వతీపురం, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, వీరఘట్టం, భామినిని, సీతంపేట తదితర మండలాల్లో భారీ వర్షం కురిసింది.

వీరఘట్టం : మండలంలోని గురువారం మధ్యాహ్నం వర్షం కురిసింది. గత రెండు రోజులుగా ఎండ వేడిమి తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్న తరుణంలో వర్షం కురవడంతో ఉపశమనం కలిగింది. ఈ వర్షంతో రైతుల కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

భామిని జోరు వాన

భామిని: మండలంలో గురువారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సుమారు రెండున్నర గంటలు పాటు ఎడ తెరిపి లేకుండా వర్షం కురిసింది. పత్తి విత్తనాలు పొలాల్లో నాటి వర్షం కోసం ఎదురుచూస్తున్న పత్తి రైతులకు ఈ వర్షం ఊరట నిచ్చింది. సుమారు మూడు నాలుగు రోజులు పాటు వర్షాలు కురిస్తే చెరువు నిండి, గెడ్డలు సాగి వరి వ్యవసాయానికి సిద్ధం అవ్వటానికి అనుకూలంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పెద్ద మనుషుల ఒప్పందం అటకెక్కినట్లేనా?

- ఎన్నికల తర్వాత కూడా ఊసెత్తని వైసిపి
- అన్యాయం జరిగిందంటున్న జర్జాపు కుటుంబం
- పార్టీకి రాజీనామా యోచనలో వైస్ చైర్‌పర్సన్

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపల్ చైర్‌పర్సన్ మార్పునకు సంబంధించి గతంలో వైసిపి జిల్లా నాయకత్వం చేసిన పెద్ద మనుషుల ఒప్పందం అటకెక్కినట్లే కనిపిస్తోంది. గత ఏడాది సెప్టెంబర్‌లో అమలు చేయాల్సిన ఒప్పందాన్ని పార్టీ అమలు చేయలేదు. రెండున్నరేళ్ల తర్వాత మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మచే రాజీనామా చేయించి వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తిని చేస్తామని మూడేళ్ల క్రితం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర హామీ ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో చైర్‌పర్సన్ పదవి కోసం జర్జాపు దీప్తి, పువ్వుల ఈశ్వరమ్మ పోటీ పడ్డారు. అప్పటి పట్టణ వైసిపి అధ్యక్షులు జర్జాపు సూరిబాబు తన కోడలు దీప్తిని చైర్‌పర్సన్ చేయాలని ఒత్తిడి పెంచారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న కోడలు దీప్తిని రాజకీయాల్లోకి జర్జాపు సూరిబాబు తీసుకొచ్చారు. వైసిపి సీనియర్ నాయకులు పువ్వుల నాగేశ్వరరావు భార్య ఈశ్వరమ్మకి చైర్ పర్సన్ దక్కాలని ఆయన పట్టుపట్టారు. ఇరువురి మధ్య రాజీ కుదిర్చి మొదటి రెండున్నరేళ్లు ఈశ్వరమ్మ, ఆ తర్వాత రెండున్నరేళ్లు వైస్ చైర్‌పర్సన్ దీప్తిని చైర్‌పర్సన్ చేస్తామని చెప్పి వైసిపి జిల్లా పెద్దలు ఒప్పందం కుదిర్చారు. సరిగ్గా రెండున్నరేళ్ల తర్వాత జర్జాపు సూరిబాబు ఒప్పందం అమలు చేయాలని అప్పటి డిప్యూటీ సీఎం రాజన్నదొర, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును కోరారు. సాధారణ ఎన్నికలు దగ్గరలో ఉన్నందున చైర్‌పర్సన్ మార్పు చేయలేమని, ఎన్నికల తర్వాత ఒప్పందం అమలు చేస్తామని జర్జాపు సూరిబాబుకు నచ్చజెప్పారు. ఎన్నికలకు ముందే పట్టణ పార్టీ అధ్యక్షులుగా ఉన్న సూరిబాబును ఆ పదవి నుంచి తప్పించారు. తన కోడలు దీప్తికి చైర్ పర్సన్ పదవి వస్తుందన్న ఆశతో సూరిబాబు ఆ పదవిని కూడా వదులుకున్నారు. తీరా ఇప్పుడు ఎన్నికలు ముగిశాయి. వైసిపి అధికారం కోల్పోయింది. ఇప్పుడైనా చైర్‌పర్సన్ మార్పుకు సంబంధించిన ఒప్పందం అమలు చేయాలని సూరిబాబు రాజన్నదొరను కోరారు. జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టిలో చైర్ పర్సన్ మార్పు విషయం తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయాలని పార్టీ పెద్దలు పువ్వుల ఈశ్వరమ్మను కోరినా ఆమె ససేమిరా అన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో తీవ్ర అసంతృప్తికి గురైన జర్జాపు సూరిబాబు పార్టీ తో అమీతుమీకి సిద్ధమవుతున్నట్లు సమాచారం. 2011 పార్టీలో కొనసాగుతున్నా అధిష్ఠానం తనకు అన్యాయం చేసిందని సూరిబాబు తన అనుచరుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇంత జరిగిన తర్వాత పార్టీలో కొనసాగడం పద్ధతి కాదనే అభిప్రాయం జర్జాపు కుటుంబం వున్నట్లు తెలుస్తోంది. తన అనుచరులతో చర్చించి వైసిపికి రాజీనామా చేయాలనే యోచనలో జర్జాపు కుటుంబం వుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈనెల 29న జరుగనున్న మున్సిపల్ సాధారణ సమావేశం నుంచే తన అనుచర కౌన్సిలర్లతో కలిసి నిరసన గళం విప్పాలని జర్జాపు సూరిబాబు యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

మున్సిపాలిటీ @ అనాథ

దీర్ఘకాలిక సెలవుపై కమిషనర్

స్థానిక మున్సిపాలిటీ పరిస్థితి దిక్కూ మొక్కూ లేని అనాథగా తయారైంది. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చిన మున్సిపల్ కమిషనర్ ప్రసన్నవాణి గడిచిన మూడు నెలలు అయిష్టంగానే ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. ఆమె ఎప్పుడు కార్యాలయంలో ఉంటారో తెలియని పరిస్థితి ఏర్పడింది. కార్యాలయానికి కూడా ఆమె తనకు నచ్చిన సమయానికి వచ్చేవారు. దీంతో సిబ్బంది కూడా ఇష్టారాజ్యంగా విధులకు హాజరయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఇటీవల మంత్రి సంధ్యారాణి ఆకస్మికంగా మున్సిపల్ కార్యాలయం తనిఖీ చేశారు. ఆమె కార్యాలయానికి వచ్చేసరికి కమిషనర్ తన సీటులో లేరు. సిబ్బంది హాజరు కూడా తక్కువగా కనిపించింది. దీంతో మంత్రి సంధ్యారాణి కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని సామాజిక మరుగుదొడ్లను వారం రోజుల్లో మరమ్మతులు చేయించాలని మంత్రి సంధ్యారాణి కమిషనర్ ప్రసన్న వాణిని ఆదేశించారు. దీంతో కమిషనర్ వెంటనే 15రోజుల సెలవు పెట్టి వెళ్లి పోయారు. మున్సిపల్ డిఇ శ్రీరామ్మూర్తికి డెలిగేట్ కమిషనర్ బాధ్యతలు అప్పగించారు. పూర్తి అదనపు బాధ్యతలతో ఇంఛార్జి బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్‌ను నియమించే వరకు మున్సిపల్ కార్యాలయంలో ఏ పనులు జరిగే అవకాశం లేదు.

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చొరవ చూపేనా?

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్.

జిల్లా కేంద్రమైన పార్వతీపురం మున్సిపాల్టీలో దశాబ్దాల కాలం నుంచి దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను కొత్తగా ఎన్నికైన స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఏవిధంగా పరిష్కరిస్తారో వేచిచూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పట్టణ ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలకు 7 నెలల ముందు పార్వతీపురం నియోజకవర్గంలో టిడిపికి కొత్తగా నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా విజయచంద్ర బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయనకు నియోజక వర్గ ప్రజలు ఊహించని రీతిలో అనూహ్యమైన విజయం అందించారు. ఈ విజయంలో పార్వతీపురం పట్టణ ప్రజలు భారీ మెజార్టీని ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఆయన నియోజకవర్గంలో దీర్ఘ కాలంగా పరిష్కారం కానీ ఎన్నో సమస్యలు ఉన్నాయి. ముఖ్యంగా నియోజక వర్గంలో గ్రేడ్-1 మున్సిపాలిటీగా ఉన్న పార్వతీపురం పట్టణంలో డంపింగ్ యార్డ్ తరలింపు, పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా, ప్రతిఏటా వర్షాకాలంలో వరహాల గెడ్డ ద్వారా వచ్చిన వరదనీటి ప్రవాహం వల్ల ముంపునకు గురవుతున్న బైపాస్ కాలనీ సమస్యలతో పాటు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాలువలతో పాటు 30 వార్డుల్లో ఉన్న కాలువల్లో మురుగునీరు ప్రవహించేందుకు సౌకర్యం లేదు. దీంతో వర్షాకాలంలో ఏమాత్రం చిన్నపాటి వర్షం కురిసినా వరద నీరు రోడ్లపై ప్రవహించే పరిస్థితి. ఈ సమస్య పరిష్కారం కావాలంటే భూగర్భ డ్రైనేజీలు ఏర్పాటు ఎంతైనా అవసరమని ప్రజలు కోరుతున్నారు. పట్టణ ప్రధాన రహదారికి ఇరువైపులా వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. ఈ ప్రధాన రహదారిపైనే ప్రతిరోజూ వందల సంఖ్యలో వాహన రాకపోకలతో నిత్యం రద్దీగానే ఉంటుంది. దీనివల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. ఈ సమస్య పరిష్కారానికి పార్వతీపురం పట్టణానికి రింగురోడ్డు అవసరం ఎంతైనా ఉంది. దీనిపైన కూడా దృష్టి పెట్టాలి. శరవేగంగా విస్తరిస్తున్న పట్టణ శివారు ప్రాంతాల్లో వెలసిన కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన, పట్టణంలో విచ్చల విడిగా నాటు సారా, గంజాయి అమ్మకాలు ఉన్నాయి. వీటితోపాటు నియోజకవర్గ పరిధిలో చాలామంది నిరుద్యోగ యువత ఉపాధి లేక ఖాళీగా ఉన్నారు. ఈ నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, చిన్న తరహా పరిశ్రమను నెలకొల్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని, దీంతోపాటు గ్రేడ్-1 మున్సిపాలిటీగా ఉన్న పార్వతీపురం పట్టణాన్ని మోడల్ పట్టణంగా అభివృద్ధి చేస్తారని పట్టణ ప్రజలు ఎంతో ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర దృష్టి పెడితే నియోజకవర్గంలో ఏ ఎమ్మెల్యేకు లభించని పేరు ప్రఖ్యాతలు విజయ్ చంద్ర సొంతం అవుతాయని పట్టణంలో పలువురు ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. శుక్రవారం జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో ఈ సమస్యలపై ఎమ్మెల్యే విజయ చంద్ర ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

మున్సిపల్ కార్యాలయంలో ఉన్న కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరగనుంది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే బోనాల విజయ చంద్ర ముఖ్య అతిథులుగా పాల్గొంటారని, ఈ కౌన్సిల్ సమావేశానికి 30 వార్డులలో ఉన్న కౌన్సిల్ సభ్యులతో పాటు, మున్సిపల్ కార్యాలయంలో ఉన్న పలు విభాగాలలో అధికారులు పాల్గొనాలని మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పట్టణాన్ని వేధిస్తున్న డంపింగ్‌యార్డు ఇదే...




కాలువల్లేక మెయిన్‌రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు



పథకాలపై అవగాహన కల్పిస్తున్న కళాజాతా సభ్యులు

ఐసిడిఎస్ పథకాలపై కళాజాతా

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ వద్ద ఐసిడిఎస్ ప్రాజెక్టుల ద్వారా అమలు చేస్తున్న పథకాలపై గురువారం కళాజాతా కళాకారుల బృందం ప్రదర్శించారు. ఈ మేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఐసిడిఎస్ ద్వారా అమలు చేస్తున్న పథకాల గురించి బుర్రకథ రూపంలో వివరించారు. బాలికలను రక్షిద్దాం, బాలికలను చదివిద్దాం, బాలల హక్కులు, చట్టాలు బాల్య వివాహాల నిషేధంతో పాటు అంగన్వాడీ కేంద్రాల ఆవశ్యకతపై కళాజాతను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని గరుగుబిల్లి, పెదగుడబ, రావివలస, సెక్టార్ సూపర్వైజర్లు రౌతు లక్ష్మి, అరుణ కుమారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది బిడ్డిక చిన్నమ్మి, చింతాడ ఉదయకుమారి, అంగన్వాడీ వర్కర్లు వల్ల కృష్ణవేణి, రౌతు పద్మ, మూడడ్ల స్వాతి, తదితరులు పాల్గొన్నారు.



పెద్దూరులో ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెద్దూరులో 'నేను బడికి పోతా'

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఇఒలు ఆనందరావు, సూర్యచంద్రరావు హాజరయ్యారు. ముందుగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బడి బయట ఉన్న విద్యార్థులు బడిలో ఉండాలని... పిల్లలు పనిలో కాకుండా బడిలో ఉండాలని.. నినాదాలు చేశారు. అనంతరం ఎంఇఒలు మాట్లాడుతూ ప్రభుత్వం చదువుకోవడానికి అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. దీన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ హెచ్.ఆదిలక్ష్మి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు నెల్లి సత్యంనాయుడు, హెచ్ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగంపేట అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.ఈశ్వరరావు మాట్లాడుతూ ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు 90 సీట్లు ఖాళీగా ఉన్నాయని వీటిని భర్తీ చేసేందుకు ఈ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత పొందిన వారికి అవకాశం ఇస్తామన్నారు. ఈ పరీక్షకు 120 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లాలోని రైతుల సమస్యలను పరిష్కరించాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల సత్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి ఇవి నాయుడుతో కలసి ధర్నా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన సాగు సాయం రైతుకు రూ.20 వేలు ఈ ఖరీఫ్ సీజన్లోనే అందించాలని, వడ్డీలేకుండా పంట రుణాలు రూ.3 లక్షల వరకు చెల్లించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చే ప్రక్రియ చేపట్టి రుణాలు అందించాలని, జిల్లాలోని ప్రాజెక్టుల కింద ఉన్న కాలువల మరమ్మతులు తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్ఒ కేశవనాయుడుకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో బుడితి శంకర్రావు, టి.జీవ, పోలురౌతు చంద్రశేఖర, నెల్లి లక్ష్మం నాయుడు, పాసర్ల సత్యనారాయణ పాల్గొన్నారు..

ఘనంగా సువార్త పాటల పోటీలు

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల రావాడ జంక్షన్ సమీపంలో గల గుడ్ సమారీటన్ లూథరన్ చర్చిలో గురువారం ఘనంగా తెలుగు క్రైస్తవ సువార్త పాటల పోటీలు హార్వేస్ట్ మినిస్ట్రీస్ వెల్ఫ్ ర్ ఆసోసియేషన్ గాయని, గాయకులు డాక్టర్ అభినవ్ దర్శన్ కడప, బ్రదర్ నజరేష్, బ్రదర్ రవి కిరణ్, సిస్టర్ సుప్రియ దర్శన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ పాటల పోటీలకు కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, సీతంపేట, తదితర మండలాల నుంచి 100 మందికి పైగా పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక పాస్టర్ డి.రాజు, ట్రినీటి చర్చి పాస్టర్ కోర్నెయేలు, సంఘ పెద్దలు డి.జాన్, డి.రాజారత్నం, డి.ప్రదీప్, డి.జయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పాము కాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని గుజ్జంగివలస గ్రామంలో పాము కాటుతో అట్టాడ లక్ష్మి (58) బుధవారం రాత్రి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మి గ్రామంలో రోడ్డు పక్కన చిన్న పాన్ షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తుంది. రోజూ లాగే పాన్ షాపు బుధవారం ఉదయం తెరచి సామాన్లు తీస్తుండగా గుర్తు తెలియని విష పాము షాపుపై నుంచి ఆమె ఎడమ చేతి మీద పడి కాటు వేసింది. వెంటనే ఆమె గుర్ల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళింది. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి ఆమెను బంధువులు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతురాలు కుమారుడు అప్పల నాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర రావు తెలిపారు. ఇది ఇలా ఉండగా ఇటీవల కాలంలో మృతిరాలి భర్త, కుమార్తె అనారోగ్యంతో మృతి చెందారు.

విద్యుత్ వైరు తగిలి దున్నపోతు మృతి

ప్రజాశక్తి -భామిని

భామిని గ్రామంలోని ఏకలవ్య భవన నిర్మాణం జరుగుతున్న ప్రదేశంలో భవన నిర్మాణ నిమిత్తం విద్యుత్ సరఫరాకు ఏర్పాటు చేసిన సర్వీస్ వైర్ తగిలి గౌడు సుధాకర్కు దున్నపోతు గురువారం సాయంత్రం మృతి చెందింది. చనిపోయిన దున్నపోతు విలువ సుమారు రూ.40వేలు ఉంటుంది అని గౌడు సుధాకర్ తెలిపారు. విద్యుత్ సర్వీస్ వైర్ తక్కువ ఎత్తులో ఉండటం వల్ల దున్నపోతు తలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందిందని చెప్పారు.

అధ్వానంగా అంతర్రాష్ట్ర రహదారి

ప్రమాదాలు బారిన ప్రయాణికులు

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం నుంచి కూనేరు వెళ్లే అంతర్ రాష్ట్ర రహదారి గత రెండేళ్లుగా అధ్వానంగా మారి భారీ గోతులు ఏర్పడ్డాయి. ఐదేవల గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అంతర్ రాష్ట్ర రహదారి చెరువులను తలపిస్తున్నాయి. మండలంలోని కొమరాడ, చోళ్లపదం గ్రామ సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై భారీ గోతులు ఏర్పడ్డాయి. దీంతో పడుతున్న వర్షాలు వల్ల గోతుల్లో వర్షపు నీరు చేరి వాహనదారులు రాకపోకలు చేసేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు, చిన్నచిన్న కార్లు గోతుల్లో నీరు ఉన్న సమయంలో దిగిపోవడంతో మరమ్మతులకు గురై ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఆ రోడ్డుపై ప్రయాణాలు చేసే వాహనదారులకు అక్కడ గోతులు ఉన్న విషయం తెలీకపోవడంతో నీటిలో గోతుల లోతు కనిపించకపోవడంతో గోతులో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. మెరువైపు అంతరాష్ట్ర రహదారిపై భారీ లోడ్లతో వెళుతున్న లారీలు సైతం గోతుల్లో మరమతులకు గురై రోడ్డుకి అడ్డంగా నిలిచిపోతున్నాయి. దీంతో భారీ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి వర్షంలో వాహనదారులు ప్రజలు తడిసి ముద్ద అయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. మరోవైపు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అనేక నిరసన కార్యక్రమాలు ఆందోళనలు చేపట్టిన అర్అండ్బి అధికారులకు కనీసం చీమకుట్టినట్టు లేకపోవడంతో ప్రజలు అధికారులు, ప్రభుత్వం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కొంతమంది స్వచ్ఛందంగా రోడ్డుపై ఉన్న గోతులను కప్పేందుకు ముందుకు వస్తున్న అవి పూర్తిస్థాయిలో జరగడం లేదు. ఇప్పటికే గతంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కొమరాడ వద్ద ఏర్పడిన గోతులను అనేకమార్లు కప్పే పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడున్న వర్షాకాలంలో భారీగా గోతులు ఏర్పడడంతో పాటు వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డు మరమ్మతులు చేయక పోయినా కనీసం గోతులు కప్పి వాహనదారులకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసే విధంగా చర్యలు చేపట్టకపోవడం చాలా దారుణమని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధ, గురువారం పడిన వర్షాలకు అంతర్రాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతులు వద్ద భారీగా వర్షపు నీరు నిలవడంతో రాకపోకలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో భారీ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి గంటల తరబడి రోడ్డు పైన నిరీక్షణ చేయాల్సిన దయన పరిస్థితి ప్రజలకు తప్పడం లేదని వారంతా గగ్గోలు పెడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి రహదారిపై ఏర్పడిన గోతులను కప్పి ప్రమాదాలను నివారించి వానదారుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



వర్షంతో చోళ్ల పదం వద్ద గొయ్యిలు ఏర్పడ్డ అంతర్రాష్ట్ర రహదారి

బందవలస రోడ్డుకు మోక్షమెప్పుడో?

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పెద్దవలస పంచాయతీ నుంచి బందవలస గ్రామానికి వెళ్లే రహదారి పరమ అధ్వాన్నంగా ఉంది. గత కొన్నేళ్లుగా ఈ రోడ్డు మరమ్మతులకు గురైనా పట్టించుకొనే నాధుడే లేదు. దీంతో ఈ గ్రామ గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యం బారిన ఎవరైనా పడితే వారిని డోలీపై మోసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా ఈ గ్రామానికి చెందిన చిన్నారులు చదువుకోడానికి పాచిపెంట వెళ్లాలంటే కిలోమీటర్ల దూరాన నడిచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. చిన్నపాటి చినుకుపడ్డా కనీసం నడవడానికి కూడా అవకాశం లేని పరిస్థితి నెలకొందని ఈ గ్రామ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వైద్యం కోసం వృద్ధురాలిని మోసుకెళ్తున్న గ్రామస్తులు

పెద్దవలస-బందవలస రోడ్డు నిర్మించాలని గిరిజన సంఘం నాయకులు జాడుదొర గంగయ్య, సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు కోరారు. పెద్దవలస నుంచి బందవలస వరకు రోడ్డు లేకపోవడం వల్ల ఎవరికైనా ఆరోగ్యం బాగోకపోతే పాచిపెంట పిహెచ్సికి తీసుకురావడానికి కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. 108 వాహనం కూడా ఈ గ్రామానికి రాలేదని, కనీసం ఆటోలు కూడా నడవని పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే గ్రామానికి చెందిన జాడుదొర చెల్లమ్మ అనే వృద్ధురాలు బుధవారం అనారోగ్యం బారినపడింది. అయితే ఆమె పాచిపెంట పిహెచ్సికి తరలించేందుకు వాహనాలేవీ రాకపోవడంతో గ్రామస్తులు డోలిపై ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. చిన్నపాటి వర్షంతో ప్రజలు నిత్యవసర వస్తువులు కూడా తీసుకురాని పరిస్థితి ఉందన్నారు. కావున అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

ప్రత్యేక డిఎస్సి ప్రకటించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జీవో నెంబర్ 3కు చట్టబద్ధత కల్పించి గిరిజనులకు ప్రత్యేక డిఎస్సి ప్రకటించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కలిసి వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 12వ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిఎస్సిపై మొదటి సంతకం చేసి 16,347 పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తున్నట్టుగా ప్రకటించడం సంతోషకరమైనదే అయినప్పటికీ గిరిజనుల కోసం ప్రత్యేక డిఎస్సి ఊసే లేకుండా ప్రకటించడం కొంత లోటుగా ఉందని అన్నారు. ఈ డిఎస్సి ప్రక్రియ ముగిసే లోపే జీవో నెంబర్ మూడుకు చట్టబద్ధత కల్పించి ప్రత్యేక డిఎస్సి ప్రకటించి గిరిజన ప్రాంతాల్లో గిరిజనులకే నూటికి నూరు శాతం ఉపాధి అవకాశాలు కల్పించే లాగా చర్యలు తీసుకోవాలన్నారు. ఐటిడిఎ పరిధిలో ఉన్న బ్యాక్లాగ్ పోస్టులను గిరిజన నిరుద్యోగులతో భర్తీ చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘ జిల్లా సహాయ కార్యదర్శి రామస్వామి, సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకట రమణ, ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు పండు, రాజు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురం మన్యం జిల్లాలో విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.పండు, కే రాజు డిమాండ్ చేశారు. గురువారం పార్వతీపురంలో పర్యటించిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ్రమ పోస్ట్ మెట్రిక్ హాస్టలలో ఎఎన్ఎం పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, సాలూరు పోస్ట్ మెట్రిక్ హాస్టల్కు రహదారి సౌకర్యం కల్పించాలని, సాలూరు మండల కేంద్రంలో ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయాలని కోరారు. కొమరాడ, సీతానగరం మండలాల్లో బాలురు బాలికల కళాశాల వసతి గృహాలు ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, పార్వతీపురం జిల్లా కేంద్రంలో బాలుర బాలికల గిరిజన సంక్షేమ కళాశాల వసతి గృహాలలో అదనంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్టి, ఎస్సి, బిసి సంక్షేమ వసతి గృహాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పాలకొండ పార్వతీపురం కేంద్రాలలో పీజీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. బలిజిపేట మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, బకాయిలు ఉన్న డైట్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, కురుపాం ఇంజనీరింగ్ కళాశాల వెంటనే పూర్తి చేయాలని గురుకుల పాఠశాలలో సీట్లు పెంచాలని చెప్పారు. పాలకొండ బాలుర పోస్ట్ మెట్రిక్ భవనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి హెచ్ సింహాచలం తదితరులు ఉన్నారు.

ఇంటింటికీ రేషన్ ఇవ్వాలి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన గ్రామాల్లో ఇంటింటికి రేషన్ ఎండియు వాహనం ద్వారా పంపిణీ చేయాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్, సహాయ కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు, కోశాధికారి ఎం. రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కురుపాంలో గల రావాడ జంక్షన్ వద్ద పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో 962 రేషన్ డిపోలు ఉండగా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి రేషన్ డిపోల వద్ద బియ్యం పంపిణీ చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామనటం సమంజసం కాదన్నారు. ఒక రేషన్ డిపో పరిధిలో సుమారు 2 లేదా 3 పంచాయతీలు 20 నుంచి 30 గ్రామాలు ఉండ డంతో వారందరూ కూడా ఐదు నుండి పది కిలోమీ టర్ల దూరం రేషన్ డిపో వద్దకు వచ్చి గంటల తరబడి రోజంతా వేచి ఉండి రేషన్ తీసుకోవలసిన పరిస్థితి వస్తుందన్నారు. దీని వల్ల అనేక వ్యక్తిగత, కొండపోడు, వ్యవసాయ పనులకు ఆటంకం కలిగి ఆర్థికంగా గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కోవలసిన పరిస్థితి వస్తుందన్నారు. గిరిజన ప్రాంతంలో ఎండియు వాహనం ద్వారా రేషన్ బియ్యం ఇంటింటికి పంపిణీ చేయాలని, నిత్యవసర సరుకులు కూడా అందజేసేలా ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు.



పాలకొండలో జయకృష్ణకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

జయకృష్ణకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి మొట్టమొదటి సారిగా పాలకొండలో అడుగు పెట్టిన సందర్భంగా ఎమ్మెల్యే జయకృష్ణకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. రోడ్డు మార్గంలో అడుగడుగునా గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మంగళహారతిలు, పూలదండలతో జయకృష్ణకు ఘనంగా స్వాగతం పలికారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయోత్సవ ర్యాలీలో సందడి చేశారు. ఓ పక్క వర్షం కురుస్తుండగా, మరో పక్క విజయోత్సవ ర్యాలీ కోటదుర్గమ్మ ఆలయం నుండి యాలాం జంక్షన్ వరకు ఘనంగా సాగింది. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేని అప్పలనాయుడు, తేజోవతి, ఇమరిక ప్రసాద్, గాడ శ్రీధర్, కోటేశ్వరరావు, గంటా సంతోష్, తదితరులు పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యే జయకృష్ణపై పూల వర్షం

వీరఘట్టం: జనసేన పాలకొండ ఎమ్మెల్యేగా శాసనసభలో ప్రమాణ స్వీకారం చేసి గురువారం తొలిసారి వీరఘట్టానికి వచ్చిన నిమ్మక జయకృష్ణపై నాయకులు, కార్యకర్తలు పూలవర్షం కురిపించారు. పార్వతిపురం మీదుగా వీరఘట్టం మండలంలోని కడకల్లా, నడిమికల్లా, విక్రంపురం, నడుకూరు, చిట్టిపూడివలస, వీరఘట్టం, రేగులపాడు, తూడి, బొడ్లపాడు, పాపంపేట, వండువ గ్రామ జంక్షన్ వద్ద కార్యకర్తల అభిమానులు రోడ్డుపైకి వచ్చి పూలదండలు వేసి పువ్వులు చల్లి అభిమానం చాటుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ మహేశ్వరరావు

సామాజిక తనిఖీలపై గ్రామసభ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామ పంచాయతీలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి సామాజిక తనిఖీలను చేపట్టిన అనంతరం గురువారం రావుపల్లి గ్రామస్థాయిలో గ్రామ సభను నిర్వహించారు. ఈ మేరకు గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులు తనిఖీలు అనంతరం సామాజిక తనిఖీ బృంద సభ్యుల ఆధ్వర్యంలో గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మర్రాపు మహేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలో వ్యయం చేసిన నిధులకు సంబంధించి సామాజిక తనిఖీలను నిర్వహించారన్నారు. సామాజిక తనిఖీ బృందం డిఆర్పి శివ మాట్లాడుతూ సామాజిక తనిఖీ బృంద సభ్యులు ముందుగా గ్రామాల్లో చేపట్టిన పనులను తనిఖీ చేశారన్నారు. తనిఖీలు పూర్తయిన అనంతరం గ్రామస్థాయిలో గ్రామసభను నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి బలగ వెంకటసాయికృష్ణ, సాంకేతిక సహాయకులు మర్రాపు ఉమామహేశ్వరి, క్షేత్ర సహాయకులు మర్రాపు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితోనే దిగుబడులు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

విత్తన శుద్ధితోనే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని రీజనల్ థిమోటిక్ లీడ్ కె.ప్రకాష్ తెలిపారు. మండలంలోని చిలకాంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా చేస్తున్న 30 మంది రైతులతో సామూహిక విత్తన శుద్ధి, బీజామృతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు పెట్టుబడులు తగ్గించి, దిగుబడులు పెంచడానికి ఏకైక మార్గం బీజామృతంతో విత్తన శుద్ధిచేయడమేనన్నారు. చిరుధాన్యాలు, వరి, రాగులు, ఆకు, కూరగాయలు, పప్పు దినుసులు మొదలగునవి చేయడం వల్ల పురుగులు, తెగుళ్ల నుండి రక్షణ పొంది, పైరు ఏపుగా పెరిగి, పురుగులు - తెగుళ్లను తట్టుకొనే సామర్థ్యం ఉంటుందని తెలిపారు. ప్రకృతిని వినాశ పరిచే ఏ రకమైన రసాయనిక ఎరువులు - పురుగు మందులు వాడకుండా సహజ సిద్ధంగా లభించే వనరులను ఉపయో గించుకోవాలని కోరారు. ఆహార ఉత్పత్తులు వినియోగించడం వల్ల, ఉత్పత్తిదారులకు వినియోగదా రులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని, పర్యావరణాన్ని పరిరక్షించినవారవుతారని అన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు రాబోయే తరానికి ఒక దిక్సూచిగా నిలవాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్, స్టేట్ రిసోర్సపర్సన్ పి.దేవుళ్లు, ఎన్ఎఫ్ఎ జి.అన్నపూర్ణ, మండల ఇన్ఛార్జి వి.పోలినాయుడు, రైతులు శంకరరావు, నారాయ ణరావు, జగదీష్, మంగమ్మ సిబ్బంది, పాల్గొన్నారు.



విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకాష్



రోగులకు మందులు అందజేస్తున్న ఎంపిపి బొంగు సురేష్

ఎంపిపి ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని అల్లువాడలో ఎంపిపి బొంగు సురేష్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఇందులో రాగోలు జేమ్స్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ వేణుగోపాల్ (కార్డియాలజిస్ట్), డాక్టర్ స్వాతి(ఆర్థోపెడియాట్రిక్), డాక్టర్ స్వామి (జనరల్ మెడిసిన్), డాక్టర్ కె.తేజ (పిల్లల వైద్యనిపుణులు), డాక్టర్ అప్పలకొండ (ఆప్తాలజీతో) తో పాటు ఏరియా మేనేజర్ కె.రమేష్ అసిస్టెంట్ మేనేజర్, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుతం వ్యాధుల సీజన్ కావడంతో ఈ వైద్య శిబిరం ఎంతో ఉపయోగమని ఎంపిపి తెలిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేసి పేషెంట్కు అవసరమైన ఇసిజి రక్త పరీక్షలు నిర్వహించి 150 మందికి చికిత్స అందించినట్లు వైద్యులు తెలిపారు. ఇందులో కంటికి సంబంధించి ఆపరేషన్ చేసేందుకు 15 మందిని ఇఎన్టి, గుండెకు సంబంధించి 26 మంది పేషెంట్లను రిఫరల్ చేస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొంగు పర్సినాయుడు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెద్ద పొల్లలో వైద్య శిబిరం

సీతంపేట: మండలంలో పెద్ద పొల్ల గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. వర్షాలు దృష్ట్యా సీజనల్ వ్యాధులు రాకుండా విద్యార్థులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. వర్షాల్లో తడవకుండా వేడి నీళ్ల తాగాలని సూచనలు ఇచ్చారు. వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని వేడి ఆహారం తీసుకోవాలని సూచించారు. జ్వరం, దగ్గు, జలుబు వ్యాధులకు సంబంధించి మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు మినక భాస్కరరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.